# ఆరోగ్య మిత్రల సమ్మె సైరన్

- 17 ఏండ్లైనా పాత జీతాలే
- పట్టించుకోని సీఎం, ఆరోగ్య మంత్రి
- దుర్భర స్థితిలో జీవితాలు
- ఆందోళన బాటలో సిబ్బంది



జూబ్లీహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

జూబ్లీహిల్స్,సెప్టెంబర్18: అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఆరోగ్య మిత్రలు సమ్మెబాట పట్టారు. ఆపదలో ఉన్న లక్షల మంది గుండె చప్పుడుగా మారిన ఆరోగ్యశ్రీ ఉద్యోగుల వేతనాల వెతలు పట్టించుకునేవారే లేకపోవడంతో ఆందోళన చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీతో పాటు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్), జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (జెహెచ్‌ఎస్), ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలను ప్రభుత్వ.. ప్రైవేట్ హాస్పిటల్స్‌లో సమర్థవంతంగా అమలుచేయడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంబీఏ, పీజీ, డిగ్రీ అర్హతతో కూడిన సుమారు 900 మందికిపైగా ఉద్యోగులు ఈ సేవలందిస్తున్నారు. 17 ఏండ్లుగా విధులు నిర్వరిస్తున్న వీరిని ఎవరూ పట్టించుకోవడం లేదు. 24 గంటలు రోగులకు అందుబాటులో ఉంటున్న ఈ ఉద్యోగులకు నేటికీ నాటి వేతనాలే దిక్కవడంతో దుర్భర స్థితిలో బతుకులు వెళ్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రితో పాటు ఇతర మంత్రులకు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో సమ్మెకు వెళ్లక తప్పడంలేదని ఆరోగ్య మిత్ర సిబ్బంది పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ డీఆర్.రమేశ్ కుమార్, రామకృష్ణ (ఆపరేషన్స్), జీఎం కార్తీక్ రెడ్డి (అకౌంట్స్) తదితర అధికారులకు రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి వచ్చిన అధ్యక్ష, కార్యదర్శులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యమిత్ర సిబ్బందికి డేటా ప్రాసెసింగ్ క్యాడర్ కల్పించాలని, జీఓ 60 ప్రకారం రూ.22,750 వేతనం తక్షణమే అమలుచేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఆరోగ్యమిత్రల జీతభత్యాలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ ద్వారా చెల్లించాలని, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్స్ ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాబోయే పీఆర్సీలో కనీస వేతనం రూ.35 వేలతో పాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని సమ్మె నోటీసులో కోరారు. ఆరోగ్యమిత్ర ఉద్యోగులందరికీ హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలని.. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో కల్పించాలని డిమాండ్ చేశారు.

## రేపటి నుంచి యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 ( నమస్తే తెలంగాణ ) : యూపీఎస్సీ సివిల్ సర్వీస్ మెయిన్ పరీక్షలు ఈనెల 20, 21, 22, 28, 29న రెండు సెషన్‌లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటచారి తెలిపారు. సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని సూచించారు. హైదరాబాద్‌లో 6 సబ్ సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 708 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్టు పేర్కొన్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. యూపీఎస్సీ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్లు, లైన్ డిపార్ట్‌మెంట్ పోలీస్, పోస్టల్, ఎలక్ట్రిసిటీ అధికారులు పాల్గొన్నారు.

## యూబీఐ ఆధ్వర్యంలో వాకథాన్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 ( నమస్తే తెలంగాణ ): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉస్మానియాయూనివర్సిటీలో బుధవారం విజిలెన్స్ అవేర్‌నెస్‌వీక్ , వాకథాన్ నిర్వహించారు. కల్చర్ ఆఫ్ ప్రాస్పరిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూబీఐ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ అజయ్‌కుమార్‌సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ సమాజంలోని అన్నిదశల్లో అవినీతిని ఎదుర్కొని దేశసమగ్రతను కాపాడేవిధంగా జవాబుదారీతనంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. జోనల్‌హెడ్, చీఫ్ జనరల్ మేనేజర్ భాస్కర్‌రావు, డిప్యూటీ జోనల్‌హెడ్,జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్‌లతో పాటు రీజనల్‌హెడ్స్, డిప్యూటీ జోనల్ హెడ్స్, వివిధ బ్రాంచ్‌లకు చెందిన రెండువందల మంది పాల్గొన్నారు.

## నిమ్స్ వైద్యులకు ఐసీఎంఆర్ గుర్తింపు



ప్రశంసా పత్రాలు అందుకున్న వైద్యులతో డైరెక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, సెప్టెంబర్ 18 : కొవిడ్ సమయంలో మూడేండ్ల పాటు శ్రమించి వైద్య సేవలందించిన నిమ్స్ వైద్యులకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. వైద్యుల సేవలను గుర్తిస్తూ ఐసీఎంఆర్ ప్రశంసా పత్రాలను అందజేసింది. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ నవాల్ చంద్ర, ప్రొఫెసర్ వైఎస్ఎన్ రాజు, ప్రొఫెసర్ సుబ్బలక్ష్మి, జమునా హుస్సేన్, మైక్రోబయాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఉమాబాల, ప్రొఫెసర్ తేజా, పద్మజా, ఎంవీఎల్ఎన్ రామ్మోహన్ ఉన్నారు. ఈసందర్భంగా వైద్యులను డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతివీర్ తదితరులు అభినందించారు.

## మెడికల్ కాలేజీలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా నిలిపివేయాలి



సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 ( నమస్తే తెలంగాణ ): మెడికల్, డెంటల్ కాలేజీలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామిగౌడ్ బుధవారం సచివాలయంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న డీమ్డ్ యూనివర్సిటీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగుల రిజర్వేషన్లను అమలు చేయకుండా కేవలం ధనవంతుల పిల్లలకు మాత్రమే మెడికల్ ఉన్నత విద్యను అందే విధంగా విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడే అవకాశం ఉందని చెప్పారు. వినోద్, బాలరాజు, మహేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## గవర్నర్‌ను కలిసిన కజకిస్తాన్ కాన్సుల్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 18 : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కజకిస్తాన్ రాజధాని ఆస్తానా అధికారిక పర్యటన అనంతరం డాక్టర్ నవాబ్ అక్కడ జరిగిన చర్చల సారాంశాన్ని గవర్నర్‌కు వివరించారు. హైదరాబాద్–ఆస్తానా మధ్య విమాన సర్వీసులను ప్రారంభించడంతో పాటు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు కజకిస్తాన్ అధికారులు ఆసక్తిగా ఉన్నారని, సాధ్యాసాధ్యాలపై చర్చించేందుకు ఈ ఏడాది చివరిలో మరో సారి హైదరాబాద్‌కు రానున్నట్లు తెలిపారు.

## 20న ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

రాజాపేట, సెప్టెంబర్ 18 : వివిధ పాఠశాలలకు చెందిన 12 మంది మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని, వారికి ఈ నెల 20న సన్మానం చేస్తామని ఎంఈఓ కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో బి.మంజుల, ఎ.మాధవీలత (రాజాపేట జడ్పీ హైస్కూల్), కె.వరలక్ష్మి (చల్లూరు), డి.గణేశ్ (పాముకుంట), సత్యనారాయణ (రఘునాథపురం), రవీందర్ (దూదివెంకటాపురం), శ్రీమతి (రాజాపేట పీఎస్), అమృత (సోమారం), ఎండీ అబ్దుల్‌అక్కి (నెమిల), సౌజన్య (కుర్రారం), రజిత (బొందుగుల) ఉన్నారని పేర్కొన్నారు.

## ఘనంగా గణేశ్ శోభాయాత్ర



భువనగిరి కలెక్టరేట్ : శోభాయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 18 : మండలంలోని బీఎన్ తిమ్మాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి శోభాయాత్ర బుధవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహాన్ని డప్పుచప్పుళ్లతో ఊరేగించి గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఎడ్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

### వినాయకుడికి పూజలు

ఆత్మకూరు (ఎం) : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఎస్ఐ కృష్ణయ్య బుధవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు పూర్తయినందున గ్రామాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను ప్రశాంతంగా నిమజ్జనం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జెన్నాయికోడె నగేశ్, మల్లేశ్, యుగేంధర్, నరేశ్, అనిల్, వెంకటేశ్, మహేశ్ పాల్గొన్నారు.

### లడ్డూ వేలం రూ.1,01,111

భూదాన్ పోచంపల్లి : మున్సిపాలిటీలోని పద్మానగర్ కాలనీలో బుగ్గ రామన్న స్వామి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద బుధవారం స్వామివారి లడ్డూ వేలం నిర్వహించారు. 1,01,111 రూపాయలకు జల్లా రామకృష్ణ దక్కించుకున్నారు.

## గెలుపోటములతో నైపుణ్యం మెరుగు : ఎస్ఐ



కరాటే జూడో పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ నాగరాజు

మోత్కూరు, సెప్టెంబర్ 18 : గెలుపోటములతో నైపుణ్యం మెరుగు పడుతుందని ఎస్ఐ డి.నాగరాజు అన్నారు. మున్సిపాలిటీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్, మోత్కూరు కరాటే క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే జూడో పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, మండల విద్యాశాఖ నోడల్ అధికారి టి.గోపాల్‌రెడ్డి, కరాటే మాస్టర్లు పి.బాలరాజు, అన్నెపు వెంకట్, బి.రవీందర్‌రెడ్డి, పీఈటీ లావణ్య పాల్గొన్నారు.

## 20, 21 తేదీల్లో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలు

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 18 : ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు, ఎంపిక పోటీలు ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎంఈఓ జి.కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న అండర్ –14, 17 విభాగంలో బాలబాలికలకు ఖోఖో, వాలీబాల్, 21న కబడ్డీ, అథ్లెటిక్స్, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులను తీసుకొని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రావాలని సూచించారు.

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 20, 21 తేదీల్లో మండల స్థాయి అండర్ – 14, 17 క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు వ్యామామ ఉపాధ్యాయుడు స్వామిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడల్లో 14, 17 సంవత్సరాల్లోపు బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వ్యాయామ ఉపాధ్యాయులు స్వామిరాజ్ (9440866962), చండీప్రసాద్ (9948640071), మల్లేశం (9849278040) సంప్రదించాలని సూచించారు.

భూదాన్ పోచంపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఈ నెల 20న బాలికలు (అండర్ 14, 17 ), 21న బాలురు (అండర్ 14, 17) క్రీడా పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంఈఓ నాగవర్ధన్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం జరిగిన పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు ఉపేందర్, శ్రీనివాస్, సత్యవతి, వెంకటేశ్వర్లు, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 18 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పల్లె దవాఖాన వైద్యురాలు మానస అన్నారు. మండలంలోని గొలనుకొండ పల్లె దవాఖానలో బుధవారం చిన్నారులకు వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత, ఆశ కార్యకర్తలు సువర్ణ, కల్పన పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో ముందుండాలి

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 18 : విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో ముందుండాలని మండలంలోని పల్లెర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాస్‌రావు అన్నారు. పాఠశాలలోని 35మంది క్రీడాకారులకు హెచ్ఎం స్వతహాగా రూ.20వేల విలువైన క్రీడా దుస్తులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి రాములునాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు జట్ట రవీందర్, ఉపాధ్యాయులు వెంకటనర్సయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, షమీమ్, త్యాగరాయచారి, శేఖర్, నాగమల్లు, విజయ పాల్గొన్నారు.





# శోభాయమానం

బై బోలో గణేశ్ మహారాజ్‌కీ జై అంటూ ...గణనాథుల శోభాయాత్రతో ట్యాంక్‌బండ్ పరిసరాలు శోభాయమానంగా మారాయి. మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన నిమజ్జనాలు బుధవారం మధ్యాహ్నం వరకు కొనసాగాయి. హుస్సేన్ సాగర్ చుట్టూ గణనాథులు బారులు తీరాయి. ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. యువత డీజే స్టెప్పులతో అందరిని ఆకట్టుకున్నారు. వినాయక విగ్రహాలను భారీ క్రేన్‌ల సహాయంతో నిమజ్జనం చేశారు. జీహెచ్ఎంసీ సిబ్బంది వ్యర్థాలను తొలగించారు.

వైభవంగా గణనాథుల నిమజ్జనం









